సాక్షి వరంగల్

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024

మేడారంలో సారలమ్మ గద్దె వద్ద కిక్కిరిసిన భక్త జనం



న్యూస్‌రీల్

జాతీయ రహదారిపై గుంతల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి : జాతీయ రహదారి–365పై ఏర్పడిన గుంతలను మంగళవారిపేట–మల్లంపల్లి సెక్టార్ ప్రాజెక్టు మేనేజర్ అనిల్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. 'డేంజర్.. ఎన్‌హెచ్–365' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఖానాపురం మండలంలోని మంగళవారిపేట నుంచి ములుగు జిల్లా మల్లంపల్లి వరకు ఉన్న జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను ఆయన పరిశీలించారు. రెండు రోజుల్లో గుంతలను పూడ్చివేస్తామని తెలిపారు. రోడ్డు కుంగిన ప్రాంతాల్లో త్వరలోనే ఒక లేయర్ తొలగించి మరమ్మతులు చేపడుతామని చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని అనిల్‌కుమార్ వెల్లడించారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం

సీజీఆర్ఎఫ్ ఇన్‌చార్జ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) ఇన్‌చార్జ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు తెలిపారు. ఈనెల 6న వరంగల్ శంభునిపేట సబ్ డివిజన్ పరిధి, 7న స్టేషన్‌ఘనపూర్ సబ్‌డివిజన్ పరిధి శివునిపల్లి సబ్ స్టేషన్‌లో, 8న కేసముద్రం సబ్ డివిజన్ పరిధి ఇనుగుర్తి సబ్ స్టేషన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఒక ప్రకటనలో సూచించారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభాపాటవ పోటీలకు నమోదు చేసుకోవాలి

విద్యారణ్యపురి: జాతీయ సైన్స్‌దినోత్సవం సందర్భంగా ఈనెల 10న నిర్వహించనున్న ప్రతిభ పోటీలకు 6వ తేదీలోగా విద్యార్థులు నమోదు చేసుకోవాలని హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై కోరారు. పెయింటింగ్, కవితలు, పాటలు, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామిని 94901 128 48లో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

ఆర్వోబీ పనులు వెంటనే పూర్తి చేయాలి

కమలాపూర్ : మండల పరిధి ఉప్పల్‌లో చేపట్టిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని జనతాదళ్(సెక్యులర్) పార్టీ (జేడీఎస్) రాష్ట్ర కార్యదర్శి వాసు వద్దూరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బ్రిడ్జి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఈ ప్రాంత పార్లమెంట్ సభ్యుడు, హుజూరాబాద్ నియోజకవర్గం మాజీ, తాజా శాసనసభ్యులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఈప్రాంతం నుంచి రోడ్డు మార్గాన రాకపోకలు సాగిస్తూ దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహించి ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, చింతకింద బాలకృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హన్మకొండ చౌరస్తా: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రూ.500 కోట్లతో ప్రత్యేక ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ ఏర్పాటు చేసిన సంఘం జిల్లా కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పందుల పెంపకందారుల అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకుల ఎంపవర్‌మెంట్ స్కీం ద్వారా మంజూరైన రూ.50 కోట్లు విడుదల చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, పల్లకొండ ప్రభాకర్, ఓని సదానందం, పాలకుర్తి నారాయణ, లోకిని సమ్మయ్య, మానుపాటి రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెషల్ టెస్ట్‌లు

కాళోజీ సెంటర్ : వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ఈనెల 12వ వరకు సబ్జెక్టుల వారీగా స్పెషల్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు ఈ పరీక్షలు ఉంటాయని తెలిపారు. 5న ఫస్ట్ లాంగ్వేజ్, 6న సెకండ్ లాంగ్వేజ్, 7న ఇంగ్లిష్, 8న మేథమెటిక్స్, 9న ఫిజికల్ సైన్స్ (ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు), 10న బయాలాజికల్ సైన్స్ (ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు), 12న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ పేర్కొన్నారు. జవాబు పత్రాలను ఏ రోజుకారోజు మూల్యాంకనం చేసి విద్యార్థుల ప్రగతిని తెలిపి, వారి సందేహాలను నివృత్తి చేయడమే పరీక్షల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అలాగే, మరుసటి రోజు జరిగే సబ్జెక్ట్‌కు సంబంధించి విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే టీచర్లు నివృత్తి చేసి సూచనలు చేస్తారని వివరించారు. ఈ టెస్ట్ ద్వారా విద్యార్థులకు రైటింగ్ ప్రాక్టీస్ విధానం సులభతరమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే డీసీఈబీ సెక్రటరీ జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు ఎస్సెస్సీ స్పెషల్ టెస్ట్ –2024 ప్రశ్నపత్రాలు చేరే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఎంఈఓలు, నోడల్ అధికారులు వివిధ పాఠశాలలను సందర్శించి పరీక్షలను పర్యవేక్షించాలని డీఈఓ సూచించారు.

నేటి నుంచి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ మూడవ సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 5వతేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5, 7, 9, 12,14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు.

ముగిసిన ఉర్సు దర్గా ఉత్సవాలు

కరీమాబాద్: వరంగల్ హజ్రత్ సయ్యద్ మాషూక్ రబ్బానీ రహ్మతుల్లా అలై 468వ ఉర్సు దర్గా ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. నయీ గడీలో ఉత్సవాలకు హాజరైన వారికి అన్నదానం నిర్వహించారు.

వనం.. జనం

మేడారానికి పోటెత్తిన భక్తులు

వనం.. జనసంద్రమైంది. చెట్టు.. పుట్ట.. వాగు, వంక.. ఎక్కడ చూసినా మేడారంలో భక్తజన ప్రవాహమే కనిపించింది. ఆదివారం తల్లుల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి వనదేవతల సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 3 లక్షల మంది అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. – ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸



మొక్కులు చెలిస్తున్న భక్తురాలు



ఎత్తు బంగారంతో మహిళ

కబ్జా కోరల్లో 'కోపాకుల'

- చెరువు మత్తడిని మింగిన ఆక్రమణదారులు
- పట్టాలు చేసిన రెవెన్యూ అధికారులు
- యథేచ్ఛగా వరి, మొక్కజొన్న పంటల సాగు
- చోద్యం చూస్తున్న ఐబీ అధికారులు



ఆక్రమణకు గురైన కోపాకుల చెరువు శిఖం భూమిలో సాగు చేస్తున్న పంటలు

చెన్నారావుపేట : రైతే రాజు అని గొప్పగా చెబుతారు.. ఆ రైతును రాజు చేసే చెరువులను కాపాడటంలో అధికారులు మాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి.. ఎందుకంటే ఆక్రమణదారులకు కొంతమంది రెవెన్యూ అధికారులు అండగా నిలిచి పట్టాలు చేస్తున్నారు.. పట్టా చూపించి యథేచ్ఛగా సాగు చేసుకుంటున్నారు. ఇదేంటి మత్తడి భూమిలో పంటలు సాగు చేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే పట్టా భూమి కాబట్టే పంటలు వేస్తున్నామని బెదిరిస్తున్నారు..

కాసులకు కక్కుర్తిపడి..

ప్రస్తుత కాలంలో కొన్ని నాణేలతోపాటు పలు రకాల కరెన్సీ నోట్లు కనుమరుగయ్యాయి. వాటిని దాచుకుని భవిష్యత్ తరాలకు తాము వాడిన నాణేలు, నోట్లు అని చెప్పుకుంటున్నాం. ఇదే మాదిరిగా రెవెన్యూ అధికారులు, ఐబీ అధికారుల నిర్లక్ష్యంతో చెరువులు ఇలా ఉండేవి అని ఫొటోల రూపంలో చూపించుకోవాల్సిన పరిస్థితి దాపురించనుంది. ఎందుకంటే కాసులకు కక్కుర్తిపడి చెరువులకే పట్టాలు చేసిన ఘనత కొంతమంది రెవెన్యూ అధికారులకు దక్కుతుంది. సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు చేయడానికి ధరణి నిబంధనలు అడ్డు వచ్చిన రెవెన్యూ అధికారులకు చెరువులు, కుంటలు, గుట్టలకు పట్టాలు చేయడానికి నిబంధనలు ఎందుకు రాలేదో వారికే తెలియాలి. మత్తడిని ఆక్రమించుకుని సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని పట్టాలు రద్దు చేయాలని ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చెన్నారావుపేట మండల కేంద్రం శివారులోని సర్వే నంబర్ 388లో కోపాకుల చెరువు సుమారు 360 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. దాని కింద 596 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతుంది. కానీ, కొందరు రెవెన్యూ అధికారులకు డబ్బు ఆశచూపి మత్తడి పరిధిలోని చెరువు శిఖం భూమికి పట్టాలు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం యథేచ్ఛగా మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసుకుంటున్నారు. చెరువు మత్తడి కింది భాగం కూడా ఆక్రమణకు గురైంది. ఇది రెవెన్యూ అధికారులకు తెలిసినా ఏమి చేయలేకపోతున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

చర్యలు ఎందుకు తీసుకోరు ?

అదేసామాన్యుడు చెరువులోకి వచ్చి భూమి దున్నితే అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేసి, జరిమానా విధించి నానా ఇబ్బందులకు గురిచేస్తారు. చెరువు భూమిని ఆక్రమణదారులు సాగు చేస్తున్నా రెవెన్యూ, ఐబీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకుంటలేరు, చెరువులను కాపాడాల్సిన బాధ్యత వారికి లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక్క కోపాకుల చెరువే కాదు మండలంలోని పలు గ్రామాల్లోని కుంటలు, చెరువుల పరిస్థితి అంతే. ధనం ఉన్నోడిదే బలం అన్నట్లుగా సాగుతోంది వ్యవహారం. గత ప్రభుత్వం మిషన్ కాకతీయతో చెరువులు, కుంటలకు హద్దులు ఏర్పాటు చేస్తామని ఆర్భాటం చేసి వదిలేసింది. నూతన ప్రభుత్వంలోనైనా చెరువులు, కుంటలకు రక్షణ కల్పించాలని, పట్టాలు రద్దు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

చెరువులను కాపాడాలి



ఆక్రమణకు గురవుతున్న చెరువులను కాపాడాలి. అక్రమంగా చేసుకున్న పట్టాలను రద్దు చేయాలి. చెరువులను సంరక్షించకపోతే భవిష్యత్ తరాలు వ్యవసాయం చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– చిట్టి రవి, ఆయకట్టు రైతు

చెరువులపైనే ముదిరాజ్‌ల జీవనం



చెరువులు ఆక్రమణకు గురైతే ముదిరాజ్‌లు జీవనోపాధిని కోల్పోతాం. కోపాకుల చెరువు ఆక్రమణకు గురవుతోందని పలు మార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. చెరువును కాపాడాలి.

– లక్క రాజు, ముదిరాజ్ సంఘం సభ్యుడు

చర్యలు తీసుకుంటాం..



కోపాకుల చెరువు భూమి, మత్తడి ఆక్రమణకు గురైన విషయం నాకు తెలియదు. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. చెరువు శిఖం భూమికి పట్టాలు చేసి ఉన్నట్లయితే రద్దు చేస్తాం.

– ఫణికుమార్, తహసీల్దార్

కారోబార్ల కష్టాలు

- చాలీచాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- జిల్లాలో 323 గ్రామపంచాయతీలు.. 250 మంది కారోబార్లు



గుండ్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

నెక్కొండ : గ్రామాల్లోని సమస్యలను ముందుండి పరిష్కరించే కారోబార్ల జీవితాలు దుర్భరంగా మారాయి. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు ప్రతి అభివృద్ధి పనిలో కారోబార్లది కీలకపాత్ర. అయితే, 40 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు గడుపుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వీరి పరిస్థితి దయనీయంగా ఉండేది. స్వరాష్ట్రంలో తమ బతుకులు మారుతాయని వారు ఆశించారు.. కానీ, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. రెండోసారి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 అక్టోబర్‌లో జీఓ 51తో జీపీ కార్మికులకు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకొచ్చింది. పాత సిబ్బందిని కొనసాగిస్తూ జీపీల్లో ప్రతి 500 జనాభాకు ఒకరిని నియమించింది. జిల్లాలోని 13 మండలాల్లో 323 మండలాలు ఉండగా.. వాటిలో 250 మంది కారోబార్లు పనిచేస్తున్నారు. గతంలో నెక్కొండ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా రెండు విలీన గ్రామాలతోపాటు మరో 16 కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. కాగా, ఇంత కాలంగా విధులు నిర్వర్తించిన తమకు ఎలాంటి పదోన్నతులు, సీనియార్టీ లేకుండా పోయిందని గ్రామాల కారోబార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఓ 51ని సవరించి, జీఓ 60 ప్రకారం మున్సిపల్ సిబ్బందికి అందిస్తున్న రూ.19,500, కిందిస్థాయి సిబ్బందికి రూ.16,600 వేతనం అందించాలని ఎన్నో సంవత్సరాలు వారు డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లు, ఎన్నికల విధుల్లో భాగంగా బీఎల్‌ఓలుగా పనిచేసినా సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఉద్యోగుల కొరతతో అన్ని పనులు చేయాల్సి వచ్చినా అదే జీతం. అటు అధికారులు, ఇటు పాలకుల అజమాయిషీతో కారోబార్లు మరిన్ని ఇబ్బందులకు గురికాక తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పర్మనెంట్ చేయాలి..



35 సంవత్సరాలుగా గ్రామంలో కారోబార్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. గ్రామంలో జరిగే ప్రతి కార్యక్రమానికి ముందుండాల్సిందే. మున్సిపల్ ఉద్యోగులకు మాదిరిగా అందిస్తున్న వేతనాలను ఇచ్చి ఆదుకోవాలి. మల్టీపర్పస్ విధానంలో సీనియార్టీ, పదోన్నతులు కోల్పోయిన వారికి రెండో కార్యదర్శిగా పదోన్నతి కల్పించాలి. ప్రభుత్వం స్పందించి మా ఉద్యోగాలు పర్మనెంట్ చేసి, కనీస వేతనాలు అమలు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరిస్తుందనే ఆశతో ఉన్నాం.

– రామానుజం వెంకటేశ్వర్లు, పెద్దకోర్పోలు కారోబార్

సమస్యలు పరిష్కరించాలి



పేరుకే గ్రామ పంచాయతీలో ఉద్యోగం.. వేతనాలు తక్కువ, పనిభారం ఎక్కువ.. పారిశుద్ధ్య పనులు చేయాలని సర్పంచ్‌లు, కార్యదర్శులు.. కారోబార్లను ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. నెక్కొండ మండలంలోనే ఐదుగురు కారోబార్లు విధులను వదులుకోవాల్సి వచ్చింది. పనిభారం ఎక్కువగా ఉంది. మా న్యాయమైన సమస్యలను ప్రభుత్వం గుర్తించి ఇప్పటికైనా పరిష్కరించాలి.

– చాగంటి వెంకటయ్య, తెలంగాణ జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జాగ్రత్తలతోనే మిర్చికి మంచి ధర

- జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు



మిరప కల్లంలో తాలు కాయలను పరిశీలిస్తున్న రైతులు

దుగ్గొండి : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిరపను ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. ఈసారి వాతావరణం కొంత వరకు అనుకూలించడంతో పాటు మార్కెట్‌లో మిర్చికి మంచి ధర ఉంది. అంతర్జాతీయ పోటీని ఎదుర్కొని ఎగుమతులు పెంచాలంటే నాణ్యమైన ఉత్పత్తులు అవసరం. మిర్చి కోత తర్వాత జాగ్రత్తలు, ఆరబెట్టే పద్ధతుల గురించి తెలుసుకోవాని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు సూచించారు. వర్షాధారం మిరప పంటలో 3 నుంచి 4 సార్లు, నీటి ఆధారిత పంటలో 6 నుంచి 8 సార్లు మిర్చిని ఏరాలి. ఏ కోతకు ఆకోత వేర్వేరుగా ఆరబెట్టాలి. పలుచని గుజ్జు, ఎక్కువ ఘనపదార్థం ఉన్న మిరపకాయలు తొందరగా ఎండుతాయి. మిరపకాయలను మొక్కల మీద పండనీయరాదు. ఎక్కువ పండితే మిరప నాణ్యత తగ్గుతుంది. అఫ్లోటాక్సిన్ వృద్ధి కాకుండా మిర్చిని పాలిథిన్ పట్టాల మీద లేదా సిమెంట్ గచ్చు మీద ఆరబెట్టాలి. రాత్రుళ్లు మంచు బారిన పడకుండా పరదాలతో కప్పి ఉంచాలి. మిరపలో తేమ 10 శాతం ఉండేలా చూడాలి. ఎండబెట్టేటప్పుడు దుమ్ముధూళి, చెత్తా చెదారం చేరకుండా కాయలు శుభ్రంగా ఉండేలా చూడాలి. కాయలు ఎండబెట్టే పరిసరాల్లో పెంపుడు జంతువులు, ఎలుకలు, పందికొక్కులు రాకుండా జాగ్రత్తపడాలి. తాలుకాయలు, మచ్చ కాయలను గ్రేడింగ్ చేసి వేరు చేయాలి. నిల్వ చేసేందుకు తేమ లేనటువంటి శుభ్రమైన గోనె సంచుల్లో నింపాలి. తేమ తగలకుండా వరి పొట్టు లేదా చెక్క బల్లల మీద గోడలకు 50–60 సెంటీమీటర్ల దూరంలో గోనె సంచులను నిల్వ చేయాలి. అవకాశం ఉన్నచోట శీతలగిడ్డంగుల్లో నిల్వ చేస్తే రంగు నాణ్యత తగ్గిపోకుండా లాభదాయకంగా ఉంటుంది. కాయలు నిగనిగలాడుతూ మంచి రంగు రావడానికి ఏ విధమైన రసాయనాలు వాడరాదు. అకాల వర్షాలకు గురికాకుండా, మంచు బారిన పడకుండా, రంగు కోల్పోకుండా ఆధునిక డ్రయ్యర్లలో ఎండబెట్టినా నాణ్యమైన మిర్చి వస్తుంది.

అలరించిన త్యాగరాయ కీర్తనలు

హన్మకొండ: హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సద్గురు త్యాగరాయస్వామి 177వ సంగీత ఆరాధనోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. భద్రకాళి దేవస్థాన ప్రధానార్చకుడు శేషు, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వెంకటరమణ, ప్రముఖ సీఏ త్రిపురనేని గోపీచంద్ అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఆరాధనోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆలపించిన త్యాగరాయ కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో సప్తస్వర మ్యూజిక్ అకాడమీ నిర్వాహకురాలు స్వరూపారాణి, లాయక్, హైమదా పాల్గొన్నారు.

బోనం వండి.. పట్నం వేసి



గర్భగుడిలో స్వామివారు

ఐనవోలు: శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి సంక్రాంతి జాతర అనంతరం మూడో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో ఆలయంలో పూజలు ఆరంభం కాగా నిత్య కైంకర్యాలు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకుని వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావతీసి(రథ సేవ) మొక్కులు తీర్చుకున్నారు. కొందరు ఒడి బియ్యం, సారె సమర్పించారు.



మల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంఘం వరంగల్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 317 ద్వారా నష్టపోయిన బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, విద్యాశాఖపై అనధికార వ్యక్తుల పెత్తనాన్ని నిలువరించాలన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతోపాటు వచ్చే విద్యాసంవత్సరం ముగిసేనాటికే ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఖమ్మంలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగే సంఘం విద్యావైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్‌బాబు, టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, ఉపాధ్యక్షుడు జె.స్వామి, లక్ష్మీపతి, బైరి స్వామి, ఊట్కూరు అశోక్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- డీసీసీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన వరంగల్ పార్లమెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలం, బలహీనతలను అంచనా వేసుకుని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఎత్తుగడలను తిప్పికొడుతూ ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళల భద్రత, ప్రాతినిధ్యం, సాధికారత, సమానత్వం కోసం జరిగే పోరాటంలో కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే 17 ఎంపీ స్థానాలు గెలిపించుకోవాలన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీసీఎం -స్కార్పియో వాహనం ఢీ

● మేడారం వెళ్తున్న భక్తులకు గాయాలు



కాళేశ్వరం: మహదేవపూర్– కాళేశ్వరం జాతీయ రహదారి 353(సీ) మార్గమధ్యలో డీసీఎం – స్కార్పియో వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ నుంచి ఆదివారం ఉదయం మేడారం సమ్మక్క– సారలమ్మల దర్శనానికి స్కార్పియో వాహనంలో ఓ కుటుంబం బయలుదేరింది. కాళేశ్వరం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా మహదేవపూర్ నుంచి వస్తున్న డీసీఎం – స్కార్పియో ఢీ కొన్నాయి. ఈ ఘటనలో స్కార్పియో వాహన డ్రైవర్ సురేష్ ఆత్రం, పిడుగు సహస్ర, సాహిత్యలకు స్వల్పగాయాలయ్యాయి. కాళేశ్వరం పోలీసులు గాయాలైన వారిని మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు. కాగా, స్కార్పియో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. కాళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం



హసన్‌పర్తి : కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లింది. హనుమకొండ–అంబాల మార్గ మధ్యలోని ముచ్చర్ల శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పాడి కల్పన, ఆమె భర్త ప్రతాప్‌రెడ్డి, వారి మనవడు, మనవరాళ్లు కలిసి ఆదివారం మధ్యాహ్నం నర్సక్కపల్లి నుంచి అంబాల మీదుగా పరకాలకు బయలుదేరారు. ఈ క్రమంలో కారు మార్గమధ్యలోని ముచ్చర్ల సమీపంలోని డీబీఎం–35 కాల్వలోకి దూసుకెళ్లింది.

తెరుచుకున్న ఎయిర్ బెలూన్స్..

కారు దూసుకెళ్లే క్రమంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకున్నాయి. ఈప్రమాదంలో కారులో ఉన్న వారందరూ సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.



జంపన్నవాగు షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



గద్దెల వద్ద ప్రసాదం తీసుకుంటున్న భక్తులు



జాతరకు వస్తున్న భక్తులు



గంట కొడుతున్న చిన్నారులు

తరలివచ్చి.. మొక్కులు తీర్చి





సమ్మక్క గద్దెకు వెళ్తున్న భక్తులు



ఎదురుకోళ్లు పడుతున్న భక్తురాలు



బంగారం (బెల్లం)తో భక్తులు



జంపన్నవాగులో మొక్కుతున్న భక్తులు

మేడారానికి పోటెత్తిన భక్తులు

- కిక్కిరిసిన వనదేవతల ప్రాంగణం
- ఉదయం 5 గంటకే గద్దెలకు తాళాలు
- పోలీసుల భారీ బందోబస్తు..
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో మేడారానికి భారీగా తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల తాకిడి పెరగడంతో అధికారులు గద్దెలకు తాళాలు వేశారు. దీంతో భక్తులు బయట నుంచి కొబ్బరి, బెల్లం, పసుపు, కుంకుమలు గద్దెల పైకి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 3 లక్షల మందికి పైగా భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ డీసీ శ్రీకాంత్‌రావు, ఈఓ రాజేంద్రం భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

అడవిలో వంటావార్పు

తల్లుల దర్శనం అనంతరం భక్తులు జాతర చుట్టు పక్కల అటవీ ప్రాంతంలోని చెట్ల కింద విడిది చేశారు. మేడారం – తాడ్వాయి 10 కిలోమీటర్లు, మేడారం – వెంగళాపూర్ 12 కిలోమీటర్ల మేరకు భక్తులు అటవీ ప్రాంతంలో చెట్ల కింద వంటావార్పు చేసుకుని ప్రకృతిని ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. వేలాది వాహనాలు రోడ్ల వెంట బారులు దీరి కనిపించాయి. అటవీ ప్రాంతం భక్తుల వంటావార్పుతో సందడిగా కనిపించింది. అడవిలోని చెట్టు, పుట్టకు కూడా పసుపు, కుంకుమ పెట్టి అమ్మవార్ల రూపంగా పూజించారు.

అధికారులు అప్రమత్తం..

మేడారానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేసి శనివారం రాత్రి నుంచే పకడ్బందీ చర్యలు చేపట్టారు. పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేసి వాహనాలను దారి మళ్లించారు. పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారం, పస్రా నుంచి నార్లాపూర్ మీదుగా మేడారానికి ప్రైవేట్ వాహనాలను మళ్లించారు. ప్రైవేట్ వాహనాలను ఎక్కడికక్కడ నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లో నిలిపివేశారు. కాగా, భక్తుల తాకిడి పెరగడంతో ఆదివారం ఉదయం 5 గంటలకే అమ్మవార్ల గద్దెలకు అధికారులు తాళాలు వేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టి, క్యూలైన్ల ద్వారా దర్శనానికి పంపించారు.

ఆర్టీసీ బస్సుల్లో 5 వేల మంది తరలింపు

మేడారానికి ఆదివారం ఆర్టీసీ బస్సుల ద్వారా 5 వేల మందిని తరలించినట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ నుంచి 60 బస్సుల్లో సుమారు 5 వేల మంది భక్తులను తరలించారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో వేల సంఖ్యలో మహిళా భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం తరలివచ్చారు. ఫలితంగా భక్తులు, బస్సుల రద్దీతో మేడారం ఆర్టీసీ బస్టాండ్ కళకళలాడింది.

పద్మశ్రీ సమ్మయ్యకు ప్రభుత్వ నజరానా

- రాష్ట్ర సర్కారు నుంచి రూ.25 లక్షల నగదు పారితోషికం
- రూ.25 వేల పింఛన్ ప్రకటన



ప్రశంసలు పొందుతున్న సమ్మయ్య

దేవరుప్పుల: పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చిందుయక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తూ నజరానా ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మవిభూషన్, పద్మశ్రీ గ్రహీతల సత్కారంలో భాగంగా జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెకు చెందిన సమ్మయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కృష్ణారావు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విప్ వేం నరేందర్‌రెడ్డి, పద్మ విభూషణ్‌లు వెంకయ్యనాయుడు, చిరంజీవీ చేతులమీదుగా రూ. 25 లక్షల నగదు పారితోషికం చెక్కు అందజేశారు. అలాగే, ప్రతి నెలా రూ.25 వేల పింఛన్‌ను ప్రకటించింది. కాగా, కేంద్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి పేద కళాకారులకు గుర్తింపు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం పురస్కార కళాకారుల జీవనప్రమాణాల మెరుగు కోసం నగదుతో పాటు ఫించన్ ప్రకటన చేయడంపై సమ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. తమకు పింఛన్ రావడానికి కృషి చేసిన కాంగ్రెస్ నాయకుడు వీహెచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరకట్న వేధింపులకు తల్లీబిడ్డ బలి

- బాలుడితో సహా వివాహిత ఆత్మహత్య
- పర్వతగిరి మండలం అన్నారం చెరువులో ఘటన
- మిల్స్‌కాలనీ స్టేషన్‌లో ఏడుగురిపై కేసు



కుమారుడితో తస్లీమ్ (ఫైల్)

ఖిలా వరంగల్/ పర్వతగిరి: వరకట్నం, శారీరక, మానసిక వేధింపులతో ఓ వివాహిత తన 7నెలల కుమారుడితో సహా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం చెరువులో మహిళ మృతదేహం లభ్యం కాగా 7నెలల బాలుడి ఆచూకీ లభించలేదు. మృతురాలి తండ్రి ఎస్.కే అఫ్జల్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. 7నెలల బాలుడి ఆచూకీ కోసం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సహకారంతో ఆదివారం గాలించగా.. బాలుడి మృతదేహం లభ్యమైంది. కాగా, కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.కె. అఫ్జల్ కుమార్తె తస్లీమ్(23)ను 19నెలల క్రితం వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ తన్వీర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.1.50లక్షలు, 3తులాల బంగారం, 26 తులాల వెండి, పల్సర్ బైక్ కోసం రూ.లక్షల ఇవ్వగా ఇంకా రూ.26వేలు ఇవ్వాల్సి ఉంది. పెళ్లి జరిగిన నెల నుంచే అదనపు కట్నం కోసం భర్త తన్వీర్, అత్త అబ్జల్ బీ, మామ మహమూద్, ఆడబిడ్డ తస్లీమా, బావ ఫారూక్, తోటికోడలు షాజహాన్, ఆడబిడ్డ భర్త జాఫర్ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈక్రమంలో ఫిబ్రవరి 1న మరో సారి అదనపు కట్నం కోసం భర్త తన్వీర్ కొట్టడంతో తస్లీమ్ అదేరోజు సాయంత్రం 7నెలల కుమారుడితో పర్వతగిరి మండలం అన్నారం దర్గా చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో పర్వతగిరి పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. అయితే మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైన వివాహిత తస్లీమ్‌గా గుర్తించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం అదే చెరువులో ఆమె కుమారుడి మృతదేహం లభ్యమైంది. ఈనేపథ్యంలో తల్లీకుమారుడి మృతికి కారణమైన నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి అఫ్జల్ ఫిర్యాదు మేరకు భర్త తన్వీర్, అత్తామామ, ఆడబిడ్డ, తస్లీమా, బావ ఫారుఖ్, తోటికోడలు షాజహా, ఆడబిడ్డ భర్త జాఫర్‌తో కలిపి ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.



అన్నారం చెరువులో మరబోట్లతో గాలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేష్, మత్స్యకారులు

చిట్‌ఫండ్ ఏజీఎం ఆత్మహత్య

కాజీపేట : హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో కనకదుర్గ చిట్‌ఫండ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నల్ల భాస్కర్ రెడ్డి (35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుబేదారి పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఎక్సైజ్ కాలనీకి చెందిన భాస్కర్ రెడ్డి కొంతకాలంగా కనకదుర్గ చిట్ ఫండ్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది పరిచయస్తుల నుంచి డిపాజిట్లు సేకరించి సంస్థలో జమచేయించాడు. తిరిగి చెల్లింపులు చేయడానికి చిట్‌ఫండ్ యాజమాన్యం సహకరించకపోవడంతో డిపాజిట్‌దారుల ఒత్తిడి పెరిగింది. దీంతో ఒత్తిడి తట్టుకోలేక హరిత హోటల్‌లో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హోటల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం వైఖరి వల్లే తన భర్త మృతిచెందాడని మృతుడి భార్య షామిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో చిన్నకిష్టాపురంలో యువకుడు..

గార్ల: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. మానుకోట జిల్లా గార్ల మండలంలం చిన్నకిష్టాపురం గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన పూనెం రాజ్‌కుమార్(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి పూనెం సంతోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిట్యాల: వివాహితపై లైంగికదాడికి పాల్పడిన కేసులో రేగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బైకాని రాజేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దాసారపు వేణుచందర్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బైకాని రాజేందర్ ఓ వివాహితకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి అందరికీ చూపిస్తానని బెదించేవాడు. దీంతో వివాహిత చిట్యాల మండలంలోని తన తల్లిగారింటికి వచ్చింది. ఈ క్రమంలో రాజేందర్ ఆమెను వెంబడించి తనతో రావాలని, లేకుంటే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదించి, వెంట తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే మీ కుటుంబ సభ్యులను చంపివేస్తానని బెదించాడు. ఆ తర్వాత వేములవాడ, బాసర, కామారెడ్డి తదితర ప్రాంతాలకు తనతో తీసుకెళ్లాడు. ఈ క్రమంలో తనకు ప్రాణహాని ఉందని గమనించిన వివాహిత నిందితుడి నుంచి తప్పించుకుని చిట్యాల మండలంలోని తల్లిగారింటికి చేరుకుంది. జరిగిన సంఘటనపై వివాహిత తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రాజేందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై జంగిలి రమేష్, కానిస్టేబుళ్లు లాల్ సింగ్, సిద్ధార్థ, రంజిత్‌ను సీఐ వేణుచందర్ అభినందించారు.

తెగులు.. దిగులు



పూతకు సోకిన తేనెమంచు తెగులు



పూతకు సోకిన బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు

మామిడి పంటకు తెగుళ్ల బెడద

- పూత దశలో తోటలు
- ఆందోళనలో యజమానులు
- సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్: మామిడిని తెగుళ్ల బెడద వెంటాడుతోంది. తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఫలితంగా తోటల యజమానులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్‌లో ప్రారంభమయ్యే పూత దశ ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. అయితే తోటలకు సంబంధించిన 'పూత'ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తెగుళ్లను ప్రారంభంలోనే నియంత్రించాలి..

మామిడి చెట్లకు పూత మొదలవగానే ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్ల ఆనవాళ్లు కనపడగానే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వాతావరణంలో వస్తున్న మార్పులకనుగుణంగా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తూ వారి సలహాలు, సూచనలు పాటించాలి. పూత దశలో వచ్చే తెగుళ్లను ముందుగా గుర్తించాలి.

మామిడిలో వచ్చే తెగుళ్లు ఏవంటే..

మామిడి తోటలు పూత దశలో ఉన్నప్పుడు ఎక్కువగా బూడిద, నల్లమచ్చ తెగుళ్లు, తేనెమంచు, తామర, పూత పురుగులు వస్తుంటాయి. అవి పూతకు సోకితే కాయ దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది.

బూడిద తెగులు.. నివారణ చర్యలు..

మామిడి పూత దశలో ఉన్నప్పుడు వాతావరణం రాత్రి పూట చల్లగా, పగటి పూట వెచ్చగా ఉన్నప్పుడు ఈ తెగులు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో పూత కాండం, పూత, పిందెలపై పొడి లాంటి బూజు పదార్థంగా చేరడంతో పూత, కాత రాలిపోతుంది. ఈ తెగులు నివారణ కోసం మొగ్గలు కనిపించే దశలో మొతాదును బట్టి గంధకం, హెక్సకోనాజోల్, ప్రొపికోనాజోల్, డినోకాఫ్, ట్రైడిమార్ఫ్ మందులు పిచికారీ చేయాలి.

నల్లమచ్చ తెగులు..నివారణ..

పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో ఈ తెగులు విజృంభిస్తుంది. ఇది మొదట లేత ఆకులు, పూలను ఆశించడంతో ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోతాయి. రెమ్మలపై కూడా నల్లని మచ్చలు ఏర్పడి పూతగుత్తులు, పూలు మాడిపోయి కాయలు రాలిపోతాయి. నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగులబెట్టాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్, బోర్డో కలిపి పిచికారీ చేయాలి. కార్బండిజం, థయోఫినేట్ లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగు..నివారణ..

మామిడిలో తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాండాలు,పూలు, లేత పిందెల నుంచి రసం పీల్చడంతో ఆకుల చివర్లో మాడిపోయి పూత మాడిపోవడమే కాకుండి పిందెలు రాలిపోతాయి. ఆకులు, కాండం, కాయలపై మసిపొర ఏర్పడుతుంది. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, డైక్లోరవాస్, డైమెథోయేట్, జిథైల్‌డెమటాన్, ఇమిడాక్లోప్రైడ్ లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



మామిడిపూత

మామిడి చెట్లు ఉన్న భూమిలో తేమ కోసం పూత వచ్చిన తర్వాత ప్రతి 10–15 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి. చలి ఎక్కువగా ఉంటే పూత రావడం ఆలస్యమవుతుంది. అందుకే పొటాషియం, నైట్రేట్, యూరియా మోతాదు ప్రకారం కలిపి పిచికారీ చేయాలి. పూత సమయంలో కొమ్మ కత్తిరించడం, దున్నడం లాంటి పనులు చేయొద్దు.

పూత పురుగు..నివారణ..

మామిడిలో ఈ పురుగు అరుదుగా కనిపిస్తుంది. తల్లి పురుగు గుడ్లు పెట్టడం ద్వారా వచ్చిన పిల్ల పురుగులు పూల కాడలోకి చొచ్చుకుపోయి కాడ భాగాన్ని తినడంతో పూల కాడలు వంగిపోయి, ఎండిపోయి పూత రాలిపోతుంది. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్, పాస్ఫమిడాన్, డైక్లోరవాస్ లాంటి మందులు అవసరం మేరకు పిచికారీ చేయాలి.

తామర పురుగు..నివారణ..

మామిడి పంట పూత సమయంలో తామర పురుగు రసం పీల్చడంతో పూత ఎండిపోయి రాలిపోతుంది. ఇది మామిడితోపాటు మిరప పంటలను కూడా నష్టపరుస్తుంది. తామర.. మంచు పురుగులు, మంగు తెగులును వ్యాప్తి చెందేలా చేస్తుంది. నివారణ కోసం ఇమిడాక్లోప్రైడ్, థయామితగ్జాం లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

రైతులు పూతను గమనించాలి..



మామిడి పూత దశలో ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ఎప్పటికప్పుడు పూతను గమనించాలి. పూత, కాండంలను పరిశీలిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. పూతలో ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటించాలి. అవసరమైన మందులు పిచికారీ చేసి మామిడి పంటను రక్షించుకోవాలి.

డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు